మానేరు నది తీరంలో ఇసుకను తవ్వి లారీల్లోకి నింపుతున్న హిటాచీ (ఫైల్)

# మానేరులో ఇసుక తవ్వకాలు చట్ట విరుద్ధం

- మైనింగ్, ఇరిగేషన్‌శాఖలకు ఎన్‌జీటీ 25 కోట్ల జరిమానా
- తీర్పు వెలువరించిన చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ బెంచ్

పెద్దపల్లి, మే 21(నమస్తే తెలంగాణ): డీసిలిటేషన్ పేరిట ఇసుక తవ్వకాలు చేపట్టడం చట్ట విరుద్ధమని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చెన్నై బెంచ్ మంగళవారం తీర్పు వెలువరించింది. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని మానేరు నదీ తీరంలో నిర్మిస్తున్న చెక్‌డ్యాంల బ్యాక్ వాటర్ ఏరియాల్లో గల ఇసుకను తీసేందుకు ప్రభుత్వం 25 ఇసుక క్వారీలకు అనుమతిచ్చింది. ఈ నిర్ణయంపై అభ్యంతరం తెలుపుతూ పలువురు పర్యావరణ ప్రేమికులు ఎన్‌జీటీని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయినా.. ఇసుక క్వారీల నిర్వహణ, డీసిలిటేషన్ ఆగకపోవడంతో తాజాగా చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ బెంచ్ సంచలన తీర్పును వెలువరించింది. తీర్పు అమలులో యంత్రాంగం నిర్లక్ష్యం వహించినందుకు ఇరిగేషన్, మైనింగ్ శాఖలకు చెరో రూ.25 కోట్ల జరిమానా విధించింది. 3 నెలల్లోపు గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు చెల్లించాలని, మానేరులో పూర్తి స్థాయిలో ఇసుక తవ్వకాలను నిలిపివేసేందుకు చర్యలను తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. అమలు నివేదికను సమర్పించేందుకు ఈ కేసు విచారణను సెప్టెంబర్ 23కు వాయిదా వేసింది.

జనగామ మండలం చీటకోడూరు చెక్‌డ్యాం నుంచి ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్న ఇసుక

## ఇష్టారాజ్యంగా ఇసుక దందా

- వాగులు, వంకల్లో తోడేస్తున్న దళారులు
- జనగామలో రైతుల పేరిట అక్రమంగా రవాణా
- పట్టించుకోని అధికార యంత్రాంగం

జనగామ, మే 21(నమస్తే తెలంగాణ): జనగామ జిల్లాలో అక్రమార్కులు ఇసుకను అడ్డగోలుగా తోడేస్తున్నారు. రాత్రి పూట గుట్టుచప్పుడు కాకుండా ఇష్టారీతిలో ఇసుక దందాను కొనసాగిస్తున్నారు. నీటి జాడలు అడుగంటకుండా కాపాడే చెరువులు, కుంటలు, వాగులు, వంకల్లో ఉన్న ఇసుక మేటలను దళారులు రాత్రికి రాత్రే ఖాళీ చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను ఆపాల్సిన సంబంధిత మైనింగ్‌శాఖ అధికారుల తోపాటు రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పట్టించుకోకపోవడం గమనార్హం. తాజాగా జనగామ మండలం చీటకోడూరులోని ఫేస్ వన్ చెక్ డ్యాం నుంచి హిటాచీ యంత్రంతో ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించి గ్రామ శివారులో డంపు చేస్తున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే ఇసుక తరలింపునకు ప్రభుత్వం నుంచి అనుమతులు లేవని, అక్రమంగా రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పున్నారు తప్ప.. వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని రైతులు, ప్రజలు వాపోతున్నారు.

## రేపే ఎడ్‌సెట్

- పరీక్ష రాయనున్న 33 వేల మంది అభ్యర్థులు

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): టీఎస్ ఎడ్‌సెట్ ఎగ్జామ్ గురువారం నిర్వహించనున్నారు. ఏపీ, తెలంగాణలో జరిగే ఈ పరీక్షకు 33,789 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఈ ఏడాది పరీక్షను మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహిస్తున్నది. పరీక్షల నిర్వహణకు 79 పరీక్షాకేంద్రాలను ఏర్పాటుచేశారు. తెలంగాణలోని పలు పట్టణాలతోపాటు ఏపీలో విజయవాడ, కర్నూల్‌లో పరీక్షాకేంద్రాలను ఏర్పాటుచేశారు. ఉదయం, మధ్యాహ్నం జరిగే పరీక్షకు ఆలస్యంగా వచ్చే వారిని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని, అభ్యర్థులు పరీక్షకు 90 నిమిషాల ముందే ఎగ్జామ్ సెంటర్లకు చేరువాలని ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ మృణాళిని సూచించారు. అభ్యర్థులు ఎడ్‌సెట్ వెబ్‌సైట్‌ను సంప్రదించి హాల్‌టికెట్లు పొందాలని తెలిపారు.

## దోస్త్‌కు 56వేల రిజిస్ట్రేషన్లు

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో ఫస్టియర్‌లో ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)కు 56వేల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకొన్నారు. సోమవారం నుంచి వెబ్ ఆప్షన్లు ప్రారంభంకాగా, మంగళవారం వరకు 10,826 మంది వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకొన్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి తెలిపారు. ఈ నెల 30 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.

## టెట్‌కు 79% హాజరు

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ) : టెట్ పరీక్షకు రెండోరోజు 79.62 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మంగళవారం ఉదయం 61 సెంటర్లు, మధ్యాహ్నం 67 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 13,904 మందికి 10,674 (76.77శాతం) మంది హాజరుకాగా, మధ్యాహ్నం పరీక్షకు 15,488 మందికి 12,730 మంది పరీక్ష రాసినట్టు టెట్ కన్వీనర్ రాధారెడ్డి తెలిపారు.

## ఏపీ సీఎస్‌తో డీజీపీ సమావేశం

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, తిరుపతి, పల్నాడు జిల్లాలో పోలింగ్ సందర్భంగా జరిగిన అల్లర్లు, దాడుల ఘటనలపై సిట్ ఇచ్చిన నివేదికపై రాష్ట్ర డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా మంగళవారం సీఎస్ కార్యాలయంలో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డితో భేటీ అయ్యారు. సిట్‌కు నాయకత్వం వహిస్తున్న బ్రిజ్‌లాల్ 12 మంది సభ్యులతో రెండురోజుల పాటు అల్లర్లు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించడంతో పాటు బాధితులు, పోలీసులు, ఎన్నికల అధికారులను కలిసి విచారణ చేపట్టారు. ఈ మేరకు 150 పేజీలతో కూడిన నివేదికను సోమవారం డీజీపీకి అందజేశారు.

# ఇన్‌చార్జి వీసీలపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి

- ప్రతిపక్షంగా వద్దని వాదన
- అధికారంలోకి వచ్చాక నాలుక మడతేసిన హస్తం పార్టీ
- 10 వర్సిటీలకు ఐఏఎస్‌లను ఇన్‌చార్జి వీసీలుగా నియమకం
- జనవరిలో కొత్త వీసీలకు నోటిఫికేషన్
- ఐదు నెలలు గడిచినా నిర్లిప్తత
- విద్యార్థి సంఘాల మండిపాటు

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని 10 యూనివర్సిటీల వైస్‌చాన్స్‌లర్ల పదవీకాలం మే 21నే ముగుస్తుందని ముందే తెలిసినా కొత్త వీసీల నియామకంపై నిర్లక్ష్యం వహించి.. ఇప్పుడేమో వద్దనుకున్న విధానాన్నే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్నది. పది వర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలుగా సీనియర్ ఐఏఎస్‌లను నియమిస్తూ మంగళవారం వేర్వేరు జీవోలు జారీ చేసి మరోమారు ద్వంద్వ వైఖరిని బయటపెట్టుకున్నది. 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఐఏఎస్‌లను ఇన్‌చార్జి వీసీలుగా నియమించినప్పుడు ఇదే కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇన్‌చార్జి వీసీల నియామకాన్ని పూర్తిగా తప్పుబట్టింది. రెగ్యులర్ వీసీలను నియమించాలని గొంతు చించుకున్నది. విద్యావేత్తలకు కాకుండా ఐఏఎస్‌లకు బాధ్యతలు ఎలా అప్పగిస్తారని

అప్పట్లో ఆ పార్టీ నేత గూడూరు నారాయణ రెడ్డి ప్రశ్నించారు. వీసీ పోస్టులంటే పార్ట్‌టైమ్ ఉద్యోగాలు కావని, కీలక బాధ్యతల్లో ఉండే ఐఏఎస్‌లు ఈ పదవికి న్యాయం చేయలేరని ఉచిత సలహాలిచ్చారు. బీజేపీ నేత కృష్ణసాగర్ రావు సైతం అప్పట్లో కాంగ్రెస్‌తో గొంతుకలిపారు. ఇన్‌చార్జిలకు బదులు రెగ్యులర్ వీసీలను నియమించాలని డిమాండ్ చేశారు. ఇవన్నీ మర్చిపోయిన కాంగ్రెస్ ప్రభుత్వం మంగళవారం 10 యూనివర్సిటీలకు ఐఏఎస్‌లను ఇన్‌చార్జి వీసీలుగా నియమించింది.

### రెగ్యులర్ నియామకాలపై కాలయాపన

రెగ్యులర్ వీసీల నియామకం కోసం జనవరిలోనే ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఆశావాహుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. సెర్చ్‌కమిటీలు వేయాల్సిన తరుణంలో అనవసరపు అనుమానాలతో కాలాయాపన చేసింది. తర్వాత ఎన్నికలకోడ్ రావడంతో ప్రక్రియ మొత్తానికే బ్రేకులు పడ్డాయి. కొత్త వీసీల నియామకానికి ఎన్నికల సంఘం ఇటీవల గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వం సెర్చ్‌కమిటీలను నియమిస్తూ జీవోలు జారీ చేసినా కమిటీ సమావేశాల నిర్వహణకు ఇప్పటివరకు ముహూర్తం కుదరలేదు. ఈ క్రమంలో రాష్ట్రంలోని 10 వర్సిటీల వీసీల పదవీకాలం మంగళవారం ముగియడంతో ఐఏఎస్‌లకు బాధ్యతలు అప్పగించింది.

> 'విద్యావేత్తలకు కాకుండా ఐఏఎస్‌లకు ఇన్‌చార్జి వీసీ బాధ్యతలు ఎట్లా అప్పగిస్తరు.. వీసీ పోస్టులేమన్న పార్ట్‌టైమ్ ఉద్యోగాలా?.. కీలక బాధ్యతల్లో ఉండే ఐఏఎస్‌లు ఇన్‌చార్జి వీసీలుగా న్యాయం చేయలేరు'
> - ఇది ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ వాదన

### యూనివర్సిటీలవారీగా ఇన్‌చార్జి వీసీలు

| వర్సిటీ | వైస్‌చాన్స్‌లర్ |
|---|---|
| ఉస్మానియా | దానకిషోర్ |
| కాకతీయ | వాకాటి కరుణ |
| జేఎన్‌టీయూ | బుర్రా వెంకటేశం |
| మహాత్మాగాంధీ | నవీన్‌మిట్టల్ |
| శాతవాహన | సురేంద్రమోహన్ |
| తెలంగాణ | సందీప్‌కుమార్ |
| బీఆర్ అంబేద్కర్ | ఎస్‌ఏ మురుజా రిజ్వీ |
| తెలుగు వర్సిటీ | శైలజా రామయ్యర్ |
| పాలమూరు | అహ్మద్ నదీం |
| జేఎన్‌ఎఫ్‌ఏయూ | జయేష్ రంజన్ |

### తప్పుపడుతున్న విద్యార్థి సంఘాలు

చటారి దశరథ్

రాష్ట్రంలోని 10 వర్సిటీల వీసీల పదవీకాలం మంగళవారం ముగుస్తుందని ముందే తెలిసినా మళ్లీ ఇన్‌చార్జిలనే నియమించడాన్ని విద్యార్థి సంఘాలు తప్పుబడుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ విధానాన్ని వద్దన్న కాంగ్రెస్, ఇప్పుడు అదే విధానాన్ని అమలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నాయి. తక్షణమే రెగ్యులర్ వీసీలను నియమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్, ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మణికంఠ, లక్ష్మణ్, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు మూర్తి, నాగరాజు డిమాండ్ చేశారు. శాశ్వత వీసీల నియామకంపై కాలయాపన చేస్తూ ప్రభుత్వం విద్యార్థులను మోసం చేసే కుట్ర పన్నిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ మండిపడ్డారు. గత ప్రభుత్వం ఇన్‌చార్జి వీసీలను నియమిస్తే గగ్గోలు పెట్టి, విద్యార్థులను గందరగోళానికి గురి చేసిన కాంగ్రెస్, ఇప్పుడు అధికారంలోకి రాగానే మాటమార్చిందని దుయ్యబట్టారు. కోడ్ అమలులో ఉన్నా వీసీలను నియమించుకోవచ్చని ఎలక్షన్ కమిషన్ అనుమతించినా పట్టించుకోకపోవడం చూస్తుంటే విద్యార్థులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో తేటతెల్లమవుతున్నదని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ విద్యాశాఖ మంత్రి లేకపోవడం, విద్యాశాఖపై ఒక్క సమీక్ష కూడా చేయకపోవడం బాధాకరమన్నారు.

# కాంగ్రెస్‌లో చేరికలతో పార్టీకి నష్టం?

- సీఎం రేవంత్‌రెడ్డి వల్లనే వలసలు
- కొత్త, పాత నాయకుల మధ్య సమన్వయ లోపం
- అధిష్ఠానానికి ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ నివేదిక

### అక్కడ ఓడిపోతే రేవంత్‌రెడ్డే కారణం?

*పార్టీలో టికెట్ ఆశించిన వారిని పక్కనపెట్టి పారాచ్యూట్ నాయకులను బరిలోకి దింపిన ఈ నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ ఓటమి పాలైతే దానికి సీఎం రేవంత్‌రెడ్డినే బాధ్యతవహించాల్సి ఉంటుందన్నది పార్టీ వర్గాల వాదన. కాంగ్రెస్ విజయవకాశాలు తక్కువగా ఉన్న వాటిలో చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి నియోజకవర్గాలను ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ ప్రత్యేకంగా పేర్కొంది. ఈ నియోజకవర్గాల అభ్యర్థులు ఎన్నికల ముందే పార్టీలో చేరడంతో కొత్త, పాత శ్రేణుల మధ్య సమన్వయం లోపించిందని కమిటీ గుర్తు చేసింది. ఇందుకు రేవంత్‌రెడ్డినే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ డైరెక్ట్‌గా చెప్పనప్పటికీ, ఆ తప్పిదాన్ని పరోక్షంగా పీసీసీ అధ్యక్షుడిపైనే మోపింది.*

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో ఇబ్బడిముబ్బడిగా జరిగిన చేరికలతో నష్టం జరిగినట్టు పార్టీ వర్గాలు, పార్లమెంట్ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ అభిప్రాయం వ్యక్తం చేశాయి. పీసీసీ అధినేత, సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్ష నిర్ణయాలే ఇందుకు కారణమని విశ్లేషిస్తున్నారు. పార్టీలో కొత్తగా చేరిన నాయకులకు, పాత నాయకులు, శ్రేణులకు మధ్య సమన్వయ లోపంవల్ల ఎన్నికల్లో నష్టం జరిగినట్టు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ వ్యాఖ్యానించడం ఈ వాదనకు బలం చేకూరింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ సరళి, పార్టీ వ్యూహం, అభ్యర్థుల విజయవకాశాలను విశ్లేషిస్తూ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ 30 పేజీల నివేదికను పీసీసీ నాయకత్వానికి అందజేసింది. దీనిని అధిష్ఠానానికి పంపనున్నట్టు దీపాదాస్ తెలిపారు. ఇది రేవంత్‌రెడ్డిపై పార్టీలో విస్తృత చర్చకు దారితీసింది.

### సమన్వయ లోపం

ఈ ఎన్నికల్లో నాయకుల మధ్య సమన్వయం లోపంపై మేనేజ్‌మెంట్ కమిటీ చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, వరంగల్ స్థానాలను ప్రస్తావించినట్టు తెలిసింది. ఈ నాలుగు స్థానాల నుంచి పోటీచేసిన అభ్యర్థులు షెడ్యూల్ వెలువడిన తర్వాత చేరినవారే. చేవెళ్ల అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, మల్కాజ్‌గిరి అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి, సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్, వరంగల్ అభ్యర్థి కడియం కావ్య సీఎం రేవంత్‌రెడ్డి ప్రోద్బలంతో పార్టీమారి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నవారే. అధిష్ఠానాన్ని ఒప్పించి వీరికి టికెట్లు ఇప్పించింది కూడా ఆయనే. ఈ పారాచ్యూట్ నాయకులను అభ్యర్థులుగా బరిలోకి దింపడాన్ని పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోయారు. ఈ చర్యను సీనియర్ నాయకులు హనుమంతరావు, నిరంజన్, జడ్సన్ బాహాటంగానే వ్యతిరేకించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గేకు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఫిర్యాదు చేశారు. ఇదే అంశంలో పీసీసీ క్రమశిక్షణా కమిటీ బక్క జడ్సన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

### ఫలితాలను బట్టే అవకాశాలు

పార్లమెంట్ ఎన్నికల కార్యాచరణపై పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పీసీసీ ముఖ్యనేతలతో నేరుగా ఒకసారి, జూమ్ మీటింగ్‌లో మరొకసారి సమీక్షించిన సందర్భంగా ఎన్నికల ఫలితాలను బట్టే భవిష్యత్‌లో పార్టీలో, ప్రభుత్వంలో అవకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఆయన చెప్పినట్టు జరిగితే కొన్ని సీట్లలో అభ్యర్థుల ఎంపికలో జరిగిన తప్పిదానికి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డినే కారణమని, మరి అక్కడ పార్టీకి ప్రతికూల ఫలితాలు వస్తే దానిపై అధిష్ఠానం ఏ విధంగా స్పందిస్తుందోనని ముఖ్యనేతలుఆసక్తిగా చూస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ భవిష్యత్తు ముడిపడి ఉన్నదన్నది వీరి వాదన. ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ నివేదికను అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంటుందా? లేక చెత్తబుట్టలో పడేస్తుందా? అనేది వేచి చూడాల్సిందే.

కొల్లాపూర్ మండలం యంగంపల్లి తండాలో వాటర్ ట్యాంకు, బోరును పరిశీలిస్తున్న మిషన్ భగీరథ అధికారులు

## పల్లెబాటలో అధికారులు

### నీటి ఎద్దడి నివారణకు చర్యలు

కొల్లాపూర్ రూరల్, మే 21 : వేసవిలో తాగునీటి ఎద్దడిని అరికట్టేందుకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. 'నీళ్లున్నా.. నల్లా రాదు' శీర్షికన మంగళవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి, కొల్లాపూర్ మండలాల పరిధిలోని గ్రామాలను ఈఈ సుధాకర్‌సింగ్, డీఈలు వెంకటేశ్వరరావు, మల్లేశ్వరరావు, ఏఈ రామాంజనేయులు సందర్శించారు. తాగునీటి ఎద్దడి, లీకేజీలపై ఆరాతీశారు. పీఆర్ఎల్ఐ ప్రాజెక్టు కారణంగా దెబ్బతిన్న పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టినట్టు చెప్పారు. వేసవి ముగిసే వరకు నీటి ఎద్దడి తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ఈఈ అధికారులను ఆదేశించారు.

# రాష్ట్రంలో మద్యం కొరత లేదు

మొదటిపేజీ తరువాయి...

ఏది కోరుకుంటే.. దానికి ఇండెంట్ పెడతారని, వాటిని అడ్డుకునే హక్కు ప్రభుత్వానికి, నాయకులకు ఉండదని తెలిపారు. త్వరలో కొత్త మద్యం బ్రాండ్‌లను తీసుకొస్తున్నారనే వార్తను ఆయన ఖండించారు. తమకు లేని ఆలోచనను పుట్టిస్తున్నారని అన్నారు. కొత్త ప్రభుత్వంలో ఇప్పటివరకు ఎవరూ కొత్త మద్యం బ్రాండ్ ప్రవేశపెడతామని దరఖాస్తు కూడా చేసుకోలేదని చెప్పారు. మద్యం కొత్త పాలసీపై తాము ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టంచేశారు. బీర్లు దొరక్కపోవడానికి కంపెనీలకు పేమెంట్ లేటు కావడం కారణం కావొచ్చని, అందుకు గత ప్రభుత్వం ఇంకా డబ్బులు చెల్లింకపోవడమేనని అన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే రూ. 2 వేల కోట్లకు పైగా ఎక్సైజ్‌శాఖకు బకాయిలు ఉన్నాయని చెప్పారు. మద్యాన్ని బ్లాక్ చేయకుండా అన్ని తయారీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు పెట్టించినట్టు తెలిపారు. వాటిని ఎక్సైజ్‌శాఖ, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామని చెప్పారు.

### ఎలక్షన్ కోడ్ తర్వాత ప్రక్షాళన

ఎన్నికల కోడ్ తర్వాత ఎక్సైజ్‌శాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని మంత్రి జూపల్లి చెప్పారు. కొన్నేండ్లుగా తిష్టవేసిన వారిని కూడా బదిలీ చేస్తామని అన్నారు. 'టానిక్'కు ఉన్న ట్యాక్స్ మాఫీని రద్దు చేశామని చెప్పారు. ప్రతిపక్షం తాగుడును పెంచమని అన్నట్టుగా మాట్లాడుతున్నదని ఆరోపించారు. ప్రభుత్వ మద్యం పాలసీ ఏదైనా ఉంటే క్యాబినెట్‌లో నిర్ణయిస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మద్యం పాలసీని తీసుకొచ్చే ఆలోచన లేదని చెప్పారు. తాను మంత్రిగా ఉండగా ఎలాంటి తప్పులు జరగవని అన్నారు.

### నమస్తే'పై 100 కోట్ల పరువునష్టం దావా

తమ ప్రతిష్టను మకసబార్చే ప్రయత్నం జరుగుతున్నదని మంత్రి జూపల్లి అన్నారు. తప్పుడు వార్తలు రాయకుండా అడ్డుకొనేందుకు 'నమస్తే తెలంగాణ' దినపత్రికపై ఎక్సైజ్‌శాఖ ద్వారా రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా తప్పుడు కథనాలు రాయొద్దని మీడియాను హెచ్చరించారు. బీర్ల కొరతను తీర్చేందుకు, డిమాండ్‌కు తగ్గ ప్రొడక్షన్ కోసం ఫైల్ పంపితే.. ఎలక్షన్ కమిషన్ నిలిపివేసిందని చెప్పారు.

తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ, గేయానికి సంగీతాన్ని అందించిన మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణిని సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో వేం నరేందర్‌రెడ్డి, అద్దంకి దయాకర్ తదితరులు

## పారిశ్రామికాభివృద్ధిలో ప్రపంచంతో పోటీపడాలి

- టీఎస్ఐఐసీ అధికారులతో సీఎం సమీక్ష
- ప్రపంచం ఉత్తమ విధానాలు అధ్యయనం చేయాలని సూచన

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): పారిశ్రామిక అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో తెలంగాణ పోటీపడేలా విధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టీఎస్ఐఐసీ) అధికారులతో మంగళవారం సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి తీసుకోవాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు. గత సమీక్షలో తీసుకున్న నిర్ణయాలు, పనుల పురోగతిపై అధికారులు సీఎంకు వివరించారు. పవర్‌లూమ్, హ్యాండ్‌లూమ్ కార్మికులకు ఉపయోగపడేలా కొత్త పాలసీని రూపొందించాలని సీఎం వారికి సూచించారు. పారిశ్రామికాభివృద్ధికి సంబంధించి ఆరు పాలసీలు రూపొందించనున్నట్టు అధికారులు తెలిపారు. ఎంఎస్ఎంఈ, ఎక్స్‌పోర్ట్, న్యూ లైఫ్ సైన్సెస్, రివైజ్డ్ ఈవీ, మెడికల్ టూరిజం , గ్రీన్ ఎనర్జీ పాలసీలను రూపొందిస్తున్నట్టు చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసేలోగా పారిశ్రామిక పాలసీలను పూర్తిస్థాయిలో రూపొందించాలని సీఎం ఆదేశించారు. ఇందుకు సంబంధించి ప్రపంచంలోని అత్యుత్తమ విధానాలు అధ్యయనం చేయాలని సూచించారు.

## తిరుమలకు రేవంత్ కుటుంబం

సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం కుటుంబ సమేతంగా బేగంపేటలోని విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి తిరుమల చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని మనవడి తలనీలాలు సమర్పించేందుకే సీఎం తిరుమల వెళ్లినట్టు అధికారులు తెలిపారు. బుధవారం తిరిగి హైదరాబాద్ చేరుకుంటారని పేర్కొన్నారు.

## త్వరితగతిన ఆలయ భూముల జియో ట్యాగింగ్

### అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): ఆలయ భూముల జియో ట్యాగింగ్ పనులను త్వరితగతిన చేపట్టాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కార్యాలయంలో ఉన్నతాధికారులతో మంగళవారం మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆక్రమణకు గురైన ఆలయ భూములను స్వాధీనం చేసుకునే దిశగా పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ చెప్పారు. ఆలయ భూముల వివాదాల పరిష్కారానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతోపాటు, సమర్థులైన న్యాయ నిపుణులను నియమించాలని తెలిపారు. రాష్ట్రంలోని 15 వేల ఎకరాల భూములకు జియో ట్యాగింగ్ చేపట్టినట్టు అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. భూముల లీజు వివరాలపై ఆరా తీసిన మంత్రి బకాయిలన్నింటినీ త్వరగా రాబట్టాలని ఆదేశించారు. ధరణిలో భూముల వివరాలు నమోదయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, సంబంధిత ఆలయాల పేరిట పాస్‌బుక్‌లు జారీ అయ్యేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఆలయ భూముల్లో ఫంక్షన్‌హాళ్లు, ఇతర ప్రజోపయోగ నిర్మాణాలు చేపట్టడం ద్వారా భూములకు రక్షణతోపాటు, ఆదాయం సమకూరుతుందని, ఈ దిశగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఆలయాల స్థల పురాణం, ప్రాశస్త్యం తదితర వివరాలను తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తేవాలని సూచించారు. ఆషాఢ బోనాల కోసం మౌలిక సదుపాయాలను కల్పించాలని చెప్పారు. సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, బ్రాహ్మణ పరిషత్ అడ్మినిస్ట్రేటర్ నర్సింహమూర్తి, ఇతర ఉన్నతాధికారులు, ప్రధాన ఆలయాల ఈవోలు పాల్గొన్నారు.

## ఐఐహెచ్‌టీలో అడ్మిషన్లకు సీఎం గ్రీన్‌సిగ్నల్: తుమ్మల

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ) : పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్‌లో ఏర్పాటు చేసే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) సంస్థలో డిప్లొమా, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి మరమగ్గాలు, చేనేత మగ్గాల ఆధునీకరణకు, నేతన్నలకు సహాయం అందించాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఇందుకు బీసీ వెల్ఫేర్‌శాఖ ద్వారా కేటాయించిన రూ